
జగన్ మార్క్



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అమ్మ ఒడి అమలు చేశారు. వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల అనే తేడా లేకుండా విద్యార్థులకు అమ్మఒడి పథకాన్ని పటిష్టంగా అమలు చేశారు. ఎలాంటి కొర్రీలు .. నిబంధనలు లేవు. పక్కాగా అమ్మఒడి అమలైంది. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పున తల్లుల ఖాతాలకు ఏటా తప్పకుండా చెప్పిన సమయానికి జమ చేశారు.

బాబు రిమార్క్

'అమ్మఒడి' స్థానంలో 'తల్లికి వందనం' పేరుతో ఇంటిలో ఎంతమంది విద్యార్థులుంటే అందరికీ ఏటా రూ.15 వేలు ఇస్తాం' అని ఎన్నికల వేళ ప్రతి సభ.. సమావేశంలో చంద్రబాబు చెప్పిన మాటలివి. అయితే అధికారంలోకి వచ్చాక ఆయన మాటల గారడీ బయటపడింది. ఇప్పుడు మాట మార్చారు.. హామీ పక్కనబెట్టారు. నయవంచనకు దిగారు. ఒక్కరికే వందనం అంటూ జీఓ జారీ చేశారు. ఈ విషయం తెలిసి.. తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.. అమలు చేయనప్పుడు హామీ ఎందుకిచ్చారంటూ ప్రశ్నిస్తున్నారు.



బాబు సూపర్ 6

స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15,000

తల్లికి వందనం పిల్లలకు బంధనం

● ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం అన్నారు ● మేనిఫెస్టోలో చేర్చి ఊదరగొట్టారు
● అధికారంలోకి వచ్చాక ఒక్కరికే అంటున్నారు ● ఇదేం పద్ధతి బాబూ .. అంటూ తల్లిదండ్రుల మండిపాటు

పులివెందుల/కమలాపురం/జమ్మలమడుగు: పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. పాఠశాలలు ప్రారంభమైన వారం పది రోజుల్లో పిల్లలను బడికి పంపే ప్రతి తల్లిఖాతాకు ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలు నగదు జమ చేసింది. ఈ నిధులతో తల్లిదండ్రులు తమ పిల్లలకు అవసరమైన విద్యాసామాగ్రిని కొనుగోలు చేసుకుని పిల్లలను సంతోషంగా బడికి పంపేవారు.

– 2024 ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో టీడీపీ ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికి పోతే అంత మందికి ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున అందిస్తామని ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ పక్కనపెట్టారు. ఒక్కరికే అంటూ తల్లికి వందనం అంటూ మాటమార్చారు. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు నెల రోజులు అవుతున్నా ఇంకా హామీ అమలు చేయకపోగా.. పూర్తి స్థాయి విధి విధానాలను త్వరలో విడుదల చేస్తామని ప్రకటించారు.

కమలాపురం నియోజకవర్గం

సంవత్సరం	తల్లులు	మొత్తం (కోట్లలో)
2020–21	18824	28.23
2021–22	19548	29.32
2022–23	20190	30.28
2023–24	18713	28.06
మొత్తం	77275	115.91

జమ్మలమడుగు నియోజకవర్గం

సంవత్సరం	విద్యార్థులు	మొత్తం కోట్లలో
2019–2024	2,16,222	912.60

రూ.30వేలు వస్తుందనుకున్నాం



తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అన్నీ రూ.15 వేల రుపాయలు ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పడంతో ఎంతో ఆశపడ్డాం. నాకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఫర్హాన్ 7వ తరగతి, 2వ కుమారుడు అర్మాన్ 5వ తరగతి చదువుతున్నారు. ఇద్దరికి ఏడాదికి రూ.30 వేలు వస్తుందని గట్టి నమ్మకం పెట్టుకున్నాం. ఇద్దరు పిల్లలను జమ్మలమడుగు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదవిస్తున్నాం. తల్లికి వందనం డబ్బులు రాగానే వారి ఫీజులు చెల్లించవచ్చునని ధీమాతో ఉన్నాం. ఇప్పుడు ఏమో ఒక్కరికే తల్లికి వందనం వేస్తారంటున్నారు.

– కుమారులతో తల్లి నజ్మా, జమ్మలమడుగు

ఎంతో ఆశగా ఉన్నాం



ఏన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చాక తల్లికి వందనం డబ్బుల కింద తమ ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అంతమంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున ఖాతాలో జమచేస్తామన్నారు. ఆ డబ్బులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. వారి ఫీజులు కట్టేందుకు పాఠశాల యాజమాన్యం తొందర పెడుతోంది. ఈ డబ్బులు వస్తే ఫీజులు కట్టేందుకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి.

– లతాదేవి, పులివెందుల

పిల్లలందరికీ తల్లికి వందనం ఇవ్వాలి



నా పేరు నాగమణి మాది వేముల గ్రామం. నా భర్త నాగరాజు కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నాకు గంగాకవిత, కార్తీక్ అనే పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. తల్లికి వందనం ఈ పథకం కింద రూ.30వేలు వస్తుందని ఎదురుచూస్తున్నాం. ఇంటిలో ఎంతమంది ఉన్నా అందరికి తల్లికి వందనం ఇస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఇప్పుడు ఇంటిలో ఒకరికే ఇస్తామంటున్నారు. ఇలా అయితే పిల్లలను చదివించుకోలేం.

– నాగమణి, వేముల గ్రామం

రూ.60 వేలు వస్తాయని ఆశ పడ్డాం



మాకు నలుగురు పిల్లలు. ముగ్గురు అమ్మాయిల తర్వాత ఒక అబ్బాయి. పెద్దమ్మాయి ఆలియా 10వ తరగతి, రెండో అమ్మాయి జైబా 9వ తరగతి, మూడవ అమ్మాయి జరీనా 6వ తరగతి, నాల్గవ సంతానం మహ్మద్ గౌస్ 4వ తరగతి చదువుతున్నారు. చంద్రబాబు ఒక్కో విద్యార్థికి రూ.15వేలు ఇస్తామని ఎన్నికల్లో చెప్పడంతో మాకు రూ.60 వేలు వస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నాం. ఒక్కరికే తల్లికి వందనం వస్తుందని తెలిసి బాధపడ్డాం. ప్రభుత్వం తల్లికి వందనం పథకంపై పునరాలోచించి ప్రతి విద్యార్థికి రూ.15వేల చొప్పున ఇవ్వాలి.

-కె. ఫ్రక్రున్, కమలాపురం.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



నా కుమారుడు కార్తికేయ 4వ తరగతి, కుమార్తె దక్షిత 6వ తరగతి చదువుతున్నారు. ఎన్నికల ముందు అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకున్న ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున ఇస్తానని చంద్రబాబు చెప్పడంతో ఆర్థిక స్తోమత లేకున్నా మేం ప్రైవేట్ స్కూల్లో ఫీజు ఎక్కువైనా చేర్పించాం. అయితే ఇప్పుడు మాట మార్చడంతో ఆందోళన చెందుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– బి.శైలజ, వేంపల్లి

ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. తల్లికి వందనం కింద ఇద్దరికి రూ.30 వేలు వస్తాయని అశగా ఉన్నా. తీరా ఇప్పుడు ఇలా చేస్తే ఏలా. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే ప్రతి ఒక్కరికి తల్లి ఖాతాలో ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక మాట మారిస్తే ఏలా, తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ఎంత మంది పిల్లలు ఉంటే అందరికి రూ.15వేలు ఇచ్చి హామీని నిలబెట్టుకొవాలి.

– ఈ.లక్ష్మిదేవి, పాతసంగటిపల్లె, పెండ్లిమర్రి

చెప్పేదొకటి.. చేసేదొకటి



ఓడలో ఉన్నంత సేపు ఓడ మల్లన్న, ఓడ దిగాక బోడిమల్లన్న అన్న చందంగా చంద్రబాబు పనితీరు ఉంది. ఎన్నికల ప్రచారంలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమంది పిల్లలకు రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం ఇస్తామని ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో గెలిచాక ఒకరికి మాత్రమే తల్లికి వందనం అంటున్నారు. బాబును నమ్మి మోసపోయాం. మా పిల్లలు ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. వారికి తల్లికి వందనం ఒకరికి మాత్రమే వస్తుందనడంతో ఫీజులు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నాం. బాబు చెప్పినట్లు ఇద్దరికి తల్లికి వందనం రూ.15 వేలు చొప్పున రూ. 30వేలు ఇవ్వాలి.

– కళ్యాణి, బోనాల, లింగాల

ఇచ్చిన హామీ అమలు చేయాలి



తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది చదువుతూ ఉంటే వారందరికి ప్రభుత్వం ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం హామీని నెర వేర్చాలి. నాకు ముగ్గురు ప్లిలు ఉన్నారు. నా భర్త కూలీ పనిచేస్తు పోషిస్తున్నాడు. తమ పెద్ద కుమారుడు చైతన్య ఇంటర్మీడియట్, మరోకుమారుడు తొమ్మిదో తరగతి, చిన్న పాప ఏడోతరగతి చదువుతోంది. మాకు ప్రభుత్వం నుంచి వచ్చె సాయం ఎంతో ఉపయోగపడుతుంది.

– తన పిల్లలతో మంగళి సునీత, జమ్మలమడుగు

క్లుప్తంగా

లింగాలలో ముస్తాబైన పీర్లు



లింగాలలో ముస్తాబైన పీర్లు

లింగాల : మండలంలో మొహరం ఉత్సవాలు నిర్వహించేందుకు పీర్లు ముస్తాభయ్యాయి. మండలంలోని లింగాల, పార్నపల్లె, దొండ్లవాగు, అక్కులుగారిపల్లె, మురారిచింతల, అంబకపల్లె, తదితర గ్రామాల్లో పీర్ల పండుగ నిర్వహించనున్నారు. లింగాల మండల కేంద్రంలోని పీర్ల చావిడిలో నిజావర్లు పీర్లను ముస్తాబుచేశారు. ఈనెల 17వ తేదీన మొహరం ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామంలో మొహరంను పురష్కరించుకుని శుక్రవారం రాత్రి పీర్లను ప్రతిష్టించారు. నూతన బట్టలు, పూల మాలలను ధరింప చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో స్థానిక పీర్ల చావిడిలో పీర్లను ప్రతిష్టించి ప్రసాదాలను పంచిపెట్టారు.

అచ్చవెల్లిలో డెంగీ వ్యతిరేక మాసోత్సవం

పులివెందుల రూరల్ : నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అచ్చవెల్లిలో డెంగీ వ్యతిరేక మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌యూనిట్ అధికారి సిద్ద య్య మాట్లాడుతూ దోమ పుట్టుకను నివారించాలి, దోమకాటు ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గూన్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. దోమల వ్యాప్తిని నివారిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శిసొజన్య, ఆరోగ్య కార్యకర్త సరస్వతి, సచివాలయం సెక్రటరీ ప్రసన్న, ఆశాకార్యకర్త భారతి పాల్గొన్నారు.

డ్రైనేజీలను పూర్తి చేయండి



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని అసంపూర్తిగా ఉన్న డ్రైనేజ్ కాలువలన్నింటి నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని పలు డ్రైనేజీలను ఆయన పరిశీలించి డ్రైనేజీలు అసంపూర్తిగా ఉండటంతో డ్రైనేజ్ నిర్మాణాలను పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డికి సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థుల ఎంపిక

కమలాపురం : మండలంలోని వివిధ పాఠశాలల్లో పదవ తరగతి ఉత్తీర్ణులైన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓలు బేబి, సుభాషిణి తెలిపారు. కమలాపురం బాలుర హైస్కూల్‌కు చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్ (570), అలాగే నల్లింగాపల్లె జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎ.సింధూజ (570) ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఎస్.వెన్నెల (566) శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు వారు వివరించారు. కాగా ఈ ముగ్గురు విద్యార్థులను ఎంఈఓలతో పాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు అభినందించారు.

మాదకద్రవ్యాల వినియోగంతో యువత పెడదారి



మొక్కలు నాటుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

పులివెందుల టౌన్ : మాదకద్రవ్యాల వినియోగంతో యువత పెడదారి పడుతున్నారని డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలు, పర్యావరణంపై ఆయన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. మాదకద్రవ్యాలు వినియోగించి యువత జీవితాలను బుగ్గిపాలు చేసుకోవద్దని, బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అలాగే కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సీఐ మోహన్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనిత, సుగుణ, అధ్యాపకులు కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధులపై చర్యలు తీసుకోవాలి

చింతకొమ్మదిన్నె : వర్షాకాలం ప్రారంభం కావడంతో కాలానుగుణంగా వచ్చే వ్యాధులనుంచి రక్షణ పొందేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో షకీలాబేగం తెలిపారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చే వ్యాధులైన జీర్ణకోశ వ్యాధులు వాటి నివారణ, దోమల వల్ల వచ్చే వ్యాధుల నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి రాఘవేంద్ర, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ స్వాతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల : మండలంలోని పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈలు బాల సంజీవులు, రమేష్‌బాబులు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు మురారిచింతల ఫీడర్ పరిధిలోని మురారిచింతల, కోమన్నూతల ఫీడర్ల పరిధిలోని, 33 కెవి ఫీడర్‌ల పరిధిలోని కోమన్నూతల, తాతిరెడ్డిపల్లె, మురారిచింతలలో విద్యుత్ లైన్లు మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బాలసంజీవులు తెలిపారు. అదేవిధంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు హిరోజీపురం, అంబకపల్లె సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 33 కెవి మెయింటెన్స్ కారణంగా విద్యుత్ కోతలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ఇందుకు రైతులు సహకరించాలని ఏఈ రమేష్‌బాబు తెలిపారు.

పులివెందుల రూరల్..

పట్టణ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు గవర్నమెంట్ ఆసుపత్రి, కోతి సమాధి సబ్‌స్టేషన్ 33/11 కెవి విద్యుత్‌లైన్ల పరిధిలో చెట్లు కొట్టే కార్యక్రమం ఉన్నందున ఈ ఫీడర్ల పరిధిలోని నలంద స్కూల్, సాయిబాబా టెంపుల్, రాజీవ్‌నగర్ కాలనీ, రాజారెడ్డి కాలనీ, ఎన్‌పీసీ బిల్డింగ్, పుల్లారెడ్డి ఆసుపత్రి, శ్రీనివాస హాల్ రోడ్డు, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, బయమ్మతోట, తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ మురళీకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని నల్లగొండువారిపల్లె, ఇ.కొత్తపల్లె, కదిరి రోడ్డు, సరస్వతి మైన్స్, ఐజీ కార్ల్, పెద్దరంగాపురం మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

తొండూరు..

మండలంలో తొండూరు, మల్లేల, భద్రంపల్లి, ఊడవగండ్ల, సంతకొవ్వూరు, గోటూరు గ్రామాల్లో ఉన్న సబ్‌స్టేషన్ల పరిదిధిలో ఉన్న ఫీడర్లకు శనివారం ఉదయం 9.30 గంటల నుంచి 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇందుకు రైతులు సహకరించాలని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : జమ్మలమడుగు పట్టణం, మైలవరం, పెద్దముడియం, కొండాపురం, జమ్మలమడుగు రూరల్ ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోతలు ఉంటాయని విద్యుత్‌శాఖ ఏడీ రాజగోపాల్, ఏఈ రాజబాబులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థినుల సమస్యల గురించి ఆరా తీస్తున్న జడ్జి ఎస్.భార్గవి

జమ్మలమడుగు రూరల్ : విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న మెను ప్రకారం భోజనం అందించాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శుక్రవారం ఆమె ప్రభుత్వ బాలికల కళాశాలలో ఉన్న బీసీ హస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వంట చేసిన భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల సమస్యలపై ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం డయోరియా ఉన్న కారణంగా హస్టల్ పరిసర ప్రాంతాలను అపరిశుభ్రత లేకుండా చూడాలని ఆమె సూచించారు. వంట పాత్రలపై దొమలు, ఈగలు వాలకుండా వాటిపై మూతలు ఏర్పాటు చేసుకోవాలని వార్డన్‌కు సూచించారు. అనంతరం సబ్‌జైల్‌ను న్యాయవాదులతో కలసి సందర్శించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాది భూతమపురం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వాసవి ప్రవచనాలు



ప్రవచనాలు వింటున్న మహిలు

వేంపల్లె : వేంపల్లెలోని 118 సంవత్సరాలు చరిత్ర గల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం పురష్కరించుకుని మొదటిసారిగా కదిరికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు సత్రసాల సాయిరాం ప్రభాకర్‌తో శ్రీ వాసవి జన్మ వృత్తాంతము– ప్రవచనములు నిర్వహించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ సిద్ధాంతి, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల హరికృష్ణ, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీవాసవి కళ్యాణ మండపం, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి ప్రముఖ షుగర్ స్పెషలిస్టు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డిచే సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

గొడవను అడ్డుకున్నందుకు కత్తిపోట్లు

చెన్నూరు : స్థానిక మైనార్టీ కాలనీ ఏటిగడ్డ వద్ద గురువారం ఆలీ అనే వ్యక్తి మద్యం తాగివచ్చి తన తల్లిదండ్రులతో గొడవ పడుతుండగా అదే కాలనీకి చెందిన జబీబుల్లా ఆ దాడిని ఆపేందుకు ప్రయత్నించగా అతనిని ఆలీ కత్తితో పొడిచాడు. గాయపడ్డ అతనిని కడప రిమ్స్‌కు తలించారు. జబీబుల్లా తండ్రి మహమ్మద్ అస్లాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలిసికట్టుగా మండలాన్ని అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ షకీలాబేగం

చింతకొమ్మదిన్నె : పార్టీలకు అతీతంగా మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుదామని మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో షకీలాబేగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ మండలంలోని అభివృద్ధి పనులపై పార్టీలకతీతంగా పనిచేద్దామన్నారు. డయేరియాపై వైద్యశాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షకీలా బేగం, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల టౌన్ : ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికి డయేరియాపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. ఇంటి చుట్టూ పిచ్చిమొక్కలను, కంప చెట్లను తొలగించాలన్నారు. వార్డు శానిటేషన్ సెక్రటరీలకు, అడ్మిన్‌లకు, ప్లానింగ్ సెక్రటరీలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పట్టణంలో ఎక్కడైనా మురుగునీటిలో తాగునీరు కలుషితమైన ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో టీపీఓ అజయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కళ్యాణి

లింగాల : ప్రస్తుత వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఉందని వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ రమాదేవి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తేజోత్స్న మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, పారిశుద్యం, విద్య, వైద్యం, తదితర అంశాలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ కళ్యాణి మాట్లాడుతూ ఉపాధిహామీ పనులు వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్నారు. అలాగే వివిధ శాఖల అధికారులు వారి శాఖల పని తీరును వివరించారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వరరావు, వ్యవసాయ అధికారి రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్య, వైద్య, తదితర శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

ఎర్రగుంట్ల : సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే పిల్లలందరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల విద్యాధికారి శివప్రసాద్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు యజమాన్యాల పాఠశాలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. చేతులను తప్పనిసరిగా వాష్ చేసుకోవాలని సూచించారు. వ్యాధులు రాకుండా నివారణో పాయాలను ఉపాధ్యాయులందరు విద్యార్థులకు తెలియజేయలన్నారు.

కొప్పర్తికి కొత్త కంపెనీలను తీసుకువస్తా

చింతకొమ్మదిన్నె : రానున్న రోజుల్లో కొప్పర్తికి నూతన కంపెనీలు వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పర్తి పరిశ్రమలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ సహకారంతో కొప్పర్తిని ఉన్నతమైన ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తానన్నారు. మెడికల్ హాస్పిటల్, ఫైర్‌స్టేషన్ వచ్చేందుకు కృషి చేస్తానన్నారు.